క్లుప్తంగా

మహిళలు అండగా నిలవాలి



మంగళగిరి: పేదల జీవితాలు మారాలంటే ప్రతి మహిళ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 27వ వార్డులో మాజీ కౌన్సిలర్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో మహిళల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. లావణ్య మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, డ్వాక్రా రుణ మాఫీ వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, పార్టీ నాయకుడు మురుగుడు సత్యం, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుచరిత ప్రత్యేక పూజలు



తాడికొండ: దామరపల్లి గ్రామంలోని పోతురాజు- పోలేరమ్మ ఆలయం 14వ తిరునాళ్లలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ నల్లిబోయిన సరస్వతితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. తుళ్లూరు మండలం శాఖమూరు తానాపతి చెరువు వద్ద ఉన్న సమ్మక్క, సారక్క ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వచనాలు పొందారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆలోకం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బకింగ్ హామ్ కెనాల్‌లో కుళ్లిపోయిన శవం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బకింగ్ హామ్ కెనాల్‌లో ఆదివారం గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీయించి, కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. బకింగ్ హామ్ కెనాల్‌లో కుంచనపల్లి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్ద కంపను తగులుకుని మృత దేహం ఉందని సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై బ్లాక్ జీన్స్ ఫ్యాంట్, బ్లూ కలర్ టీ షర్ట్ ఉన్నాయని, శరీరం కుళ్లిపోవడంతో ఎటువంటి గుర్తులు లభించలేదని తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే తాడేపల్లి పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

నేడు 14వ వార్డులో లావణ్య ప్రచారం

మంగళగిరి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య సోమవారం ఉదయం 7.30 గంటలకు 14వ వార్డులోని మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ఇంటి నుంచి ప్రచారం ప్రారంభించనున్నట్లు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటలో తెలిపింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

వ్యభిచారిణులు, విటులు అరెస్ట్

పట్నంబజార్: లాడ్జిల్లో వ్యభిచారానికి పాల్పడుతున్న మహిళలు, విటులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. కొత్తపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్ఓ షేక్ అన్వర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం కొత్తపేట పీఎస్ పరిధిలోని పలు లాడ్జిల్లో తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వైష్ణవి లాడ్జిలో ఒక మహిళను, రైలు పేటలోని శ్రీలేఖ లాడ్జిలో ఇరువురు మహిళలను, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

వైభవం.. గణపతి కల్యాణం



పాత గుంటూరు: అరండల్ పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ నిర్వహణలో ప్రత్యేక పూజలు, శ్రీ సిద్ధి, బుద్ధి సమేత గణపతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ మాంగళ్య ధారణ, అనేక పుష్పాలతో అభిషేకం, తలంబ్రాలు వంటి కార్యక్రమాలతో కనుల పండువగా జరిగింది. విశేషంగా పాల్గొన్న దంపతులు, భక్తులు మంత్రపుష్పం, మహా హారతి అనంతరం తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కుంకుమపూజలు విశేషంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆదిలక్ష్మీ నారాయణుల కల్యాణం జరుగుతుందని అర్చకులు ప్రసాద్ తెలిపారు.

ఎన్నికల నిబంధన అమలు



ఎన్నికల కోడ్‌ను ప్రజలకు వివరిస్తున్న తహసీల్దారు రాఘవేంద్రరావు



తాడికొండ అడ్డరోడ్డులో బ్యానర్ల తొలగింపు..



గ్రామాల్లో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ బలగాలు

ఫిరంగిపురం: సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ప్రజలు, నాయకులు సహకరించాలని తహసీల్దారు రాఘవేంద్రరావు కోరారు. మండల కార్యాలయంలో వీఆర్వోలకు అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వేములూరిపాడులో కార్యదర్శి ఏకే బాబుతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమలైన 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాలు, 48 గంటల్లోగా ప్రైవేట్ ప్రదేశాల్లో బ్యానర్లు, రాజకీయ పార్టీల జెండాలు, ప్రభుత్వ పరమైన పథకాల వివరాలు తొలగించాలని చెప్పారు. 72 గంటల్లోగా పూర్తిగా తొలగించాలని చెప్పారు. రాజకీయ నాయకుల చిత్ర పటాలు, విగ్రహాలు కన్పించకుండా వస్త్రాలు కప్పడం, ముసుగులు వేయాలని చెప్పారు. గ్రామ సెంటర్లో ఉన్న హోర్డింగులను తొలగించారు.

తాడికొండలో..

తాడికొండ: తాడికొండ, తుళ్లూరు మండలాల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల జెండాలు, నాయకుల బ్యానర్లు తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. తాడికొండ, తుళ్లూరు ఎంపీడీఓలు అనురాధ, శివన్నారాయణ పంచాయతీ సిబ్బంది సహకారంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, 48 గంటల్లో బహిరంగ ప్రదేశాల్లో బ్యానర్లను తొలగించాల్సి ఉన్న నేపథ్యంలో ఆ దిశగా తలమునకలయ్యారు.

పోలీసు శాఖ సిద్ధం..

తాడికొండ: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తుళ్లూరు సీఐ షేక్ సుబాని తెలిపారు. ఆదివారం తుళ్లూరు మండలం లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, తాళ్ళాయపాలెం, వెంకటపాలెం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో వివాదాస్పద వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ఆయా పార్టీలు, నాయకులు నడుచుకోవాలని సామాన్యుడికి ఇబ్బంది కలిగించేలా ఎవరు వ్యవహరించినా చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు..

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలో ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించిన స్టిక్కర్లు, బోర్డులను అధికారులు ఆదివారం తొలగించారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాహనాల మీద స్టిక్కర్ల తొలగించి, రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచార బోర్డులు ఉండ కూడదని, వాటిని వెంటనే తొలగించాలని ఎంపీడీఓ భార్గవి సచివాలయ సిబ్బందికి సర్క్యులర్ జారీ చేశారు.

ముమ్మరంగా ప్రచారబోర్డుల తొలగింపు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన డిజిటల్ బోర్డులు, ఇతర ప్రచార బోర్డుల తొలగింపు చర్యలు అధికారులకు తలనొప్పిగా మారింది. ఇందుకు భారీగా ఖర్చు అవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆదివారం ఎంటీఎంసీలోని కొన్ని ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన డిజిటల్ బోర్డులు, కూర్చునే బల్లలు తొలగించారు. ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల కమిషన్ నిబంధలను తప్పనిసరిగా పాటిస్తామన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రచార బోర్డులు, ఇతర ప్రచార సాధనాలను తొలగిస్తామని.. ఏ పార్టీకి అనుకూలంగా అధికారులు పనిచేయరని ఆయన స్పష్టం చేశారు.



దుగ్గిరాలలో 108 అంబులెన్స్‌పై ఫొటోల తొలగింపు

ఘనంగా గాయత్రీ సంగీత సన్మండలి వార్షికోత్సవం



అంబటిపూడి కామాక్షిని సత్కరించిన అతిథులు, నిర్వాహకులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి 27వ వార్షిక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై శేష రాణి ఆధ్వర్యంలో జరిగిన సభకు డాక్టర్ పి.విజయ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ భువనగిరి కృష్ణవేణి, జస్టిస్ బులుసు శివశంకరరావు, మునుగంటి వెంకట్రావు, డాక్టర్ బయ్యా శ్రీనివాసరావు, సంగీత సన్మండలి వ్యవస్థాపకులు డాక్టర్ టి.సూర్య కాంతం, ఆలయ అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య పాల్గొని విదుషి అంబటిపూడి కామాక్షికి స్వర్ణ పతకం బహూకరించి సత్కరించారు. సంస్థ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ అనంతరం స్థానిక పురస్కార గ్రహీతలు సంగీతంలో విదుషి వీణ విశారద ఎ.భారతి దేవి, సాహిత్యంలో సుఖవాసి మల్లికార్జునరాయ శాస్త్రి, నృత్యంలో బీరక సురేష్ బాబు, ఆధ్యాత్మికతలో డాక్టర్ దీవి నరసింహ దీక్షిత్, సామాజిక సేవలో మానవతా సేవా సమితి చెన్నం శెట్టి రామారావులను పురస్కారాలతో సత్కరించారు. సభానంతరం జరిగిన అంబటిపూడి కామాక్షి చేసిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీతాభిమానులను అలరించింది. వీరికి మృదంగంపై మల్లాది శివానంద యశస్వి, ఘటంపై ఎ.ఎ స్.ఆర్. కౌండిన్య వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలిత దేవి, కార్యదర్శి మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ, డాక్టర్ సుమిత్ర, ఎం.గిరిజ పర్యవేక్షించారు.

పరీక్ష కేంద్రాల సందర్శన



కళ్లం వెంకటరెడ్డి పాఠశాల కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ శాంతకుమారి

తాడేపల్లిరూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండటంతో.. తాడేపల్లి, దుగ్గిరాల ఎంఈఓలు శాంతకుమారి, శ్రీనివాసరావు ఆదివారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. శాంతకుమారి మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, మండల పరిధిలో 5 పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ దుగ్గిరాల మండల పరిధిలో బాలికలు, బాలుర హైస్కూల్, ఈమని, రేవేంద్రపాడు, పెదపాలెం పాఠశాలలో 10వ తరగతి పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్య వైఖరి తగదు



విగ్రహానికి ముసుగు వేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

నెహ్రూనగర్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆదివారం నగరపాలక సంస్థ ఎన్నికల విభాగాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన సమయంలో విధుల్లో లేని సూపరింటెండెంట్ పద్మకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల విధుల్లో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సెక్షన్‌లో అందుబాటులో లేకపోవడం, గతంలో ఆదేశించిన విధంగా పోలింగ్ కేంద్రాల వారీగా అందిన క్లెయిమ్స్‌ని ఆర్డర్‌లో ఉంచడంలో నిర్లక్ష్యంగా ఉండడం గమనించి షోకాజ్ నోటీసు జారీ చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి రాజకీయ పార్టీల ర్యాలీల్లో, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, ఎక్కడైనా పాల్గొన్నట్లు నిరూపణ అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే నగరంలో వార్డు సచివాలయాల్లో ముఖ్యమంత్రి, రాజకీయ నాయకుల ఫొటోలు, ప్రభుత్వ పథకాల సూచిక బోర్డ్‌లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు పూర్తి స్థాయిలో తొలగించాలని నోడల్ అధికారులకు, అడ్మిన్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నగరంలో ప్రభుత్వ భవనాలు, జంక్షన్లు, నగరపాలక సంస్థ స్థలాల్లో ఏర్పాటు చేసిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించడం జరిగిందన్నారు.

రాజకీయ పార్టీల పోస్టర్లు తొలగింపు

సార్వత్రిక ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) శనివారం నుంచే అమలులో ఉందని, నగరంలో రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగిస్తున్నామని, ఇంకా ఏమైనా ఎంసీసీకి సంబంధించి ఫిర్యాదులు ఉంటే నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ సెల్ 98499 08391 నంబర్‌కి కాల్/ వాట్సాప్ చేయవచ్చని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్ఓ) కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ మేరకు నగరంలోని ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలను నగరపాలక సిబ్బంది తొలగిస్తున్నారని, బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయపరమైన ప్రకటనలు, వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు అన్నింటినీ శనివారం నుంచి తొలగించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ఎక్కడైనా ఎంసీసీ ఉల్లంఘనలను ప్రజలు గుర్తిస్తే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కంప్లైంట్ సెల్‌కు కాల్/వాట్సాప్ ద్వారా తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసులు..

నగరపాలక సంస్థ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ జె.నాగేంద్ర కుమార్‌కి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం కమిషనర్ ఛాంబర్‌లో జరిగిన ఎలక్షన్ ఎక్స్‌పెండీచర్ సమావేశానికి హాజరు కాకపోవడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో అత్యంత కీలకమైన సమావేశానికి గైర్హాజరైన ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగేంద్ర ప్రసాద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు.

గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వల్లూరు వెంకటరమణ, ఎస్ఎం సుభాని ఎన్నికయ్యారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయసంస్థ పెన్షనర్ల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ సలహాదారులుగా తిరుమలశెట్టి నరసింహారావు, పరిసా సాంబశివరావు, సజ్జా మధుసూదనరావు, గౌరవాధ్యక్షుడిగా కావూరి నారాయణరావు, జె.జగన్‌మోహన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కోన దేవదాసు, ఉపాధ్యక్షులుగా కందుల ఝాన్సీలక్ష్మి, సూదినేని మల్లిఖార్జునరావు, కోశాధికారిగా గౌరవరపు గురవయ్య, సహాయ కార్యదర్శిగా నూతలపాటి శివయ్య, కార్యవర్గసభ్యులుగా కరణం వెంకటేశ్వర్లు, కొండూరు వెంకటేశ్వర్లు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, పోగుల రామలింగేశ్వర శర్మ, ఆలపాటి వెంకట రమణ, జీఎస్ఎస్‌వీ ప్రసాద్, దంటు నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన వీవీ రమణ, ఎస్ఎం సుభాని మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

వైభవంగా గంగానమ్మ కొలుపులు



తెనాలి టౌన్: పట్టణంలోని బాలాజీరావుపేటలో ఆదివారం గంగానమ్మ తల్లి కొలుపులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభను ఊరేగించారు. కనకతప్పెట్లతో కాళీ కామాత వేషాలతో కళాకారులు ప్రదర్శన ఆకట్టుకుంది. గంగానమ్మ గుడిలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, వరలక్ష్మి, గాయత్రి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు నగరపాలక సంస్థ స్పందన రద్దు

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం జరిగే నగరపాలక సంస్థ స్పందన కార్యక్రమంలో సోమవారం నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. నగర ప్రజలు స్థానిక సమస్యలపై నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో దేవాలయానికి తరలిరావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, బుడ్డా వెంకటలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

కుటుంబంలో జనసేన రాజకీయ చిచ్చు..

తాడేపల్లిరూరల్ : అన్నదమ్ముల మధ్య రాజకీయ చిచ్చు పెట్టి, వారిని ఆసుపత్రిపాలయ్యేలా చేశారని బాధితుల తల్లితండ్రులు స్థానిక జనసేన నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల వివరాల మేరకు.. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో కూలి పనులు చేసుకుని జీవించే జీలగ వెంకటేశ్వరరావు, లీలమ్మకు నలుగురు సంతానం. రాబర్ట్, నాగార్జున, నాగేంద్రబాబు, శివప్రసాద్.. వీరిలో ముగ్గురు పార్టీలతో సంబంధం లేకుండా పెయింట్ పనులు చేసుకుంటున్నారు. వీరిలో నాగేంద్రబాబు జనసేన పార్టీలో తిరుగుతుంటాడు. శనివారం రాత్రి శివప్రసాద్ అతని స్నేహితులతో రోడ్డుపై పెయింట్ పనుల గురించి చర్చిస్తున్నాడు. పనికి రానివారి గురించి ఏదో మాట్లాడుతుండగా.. అటుగా వెళ్తున్న జనసేన కార్యకర్త మహేంద్ర తననే తిడుతున్నాడని భావించి, అతని సోదరుడు నాగేంద్రబాబుకు ఫోన్ చేసి, జనసేనను, పార్టీ నాయకులను తిడుతున్నాడని చెప్పాడు. దీంతో నాగేంద్రబాబు అక్కడికి చేరుకుని సోదరుడు శివప్రసాద్‌తో గొడవ పడ్డాడు. ఇదే అదునుగా భావించిన జనసేన కార్యకర్తలు ఆ కుటుంబం మీద పాతకక్షల నేపథ్యంలో రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో మరో సోదరుడు నాగార్జున చేతికి తీవ్రమైన గాయమైంది. ఈ క్రమంలో అతనిని హాస్పిటల్ చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. తాము ఆసుపత్రిలో ఉంటే రాజకీయ రంగు పులిమి ఇబ్బంది పెడుతున్నారని వెంకటేశ్వరరావు, లీలమ్మ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు



పెన్షన్లు పంపిణీ చేస్తున్న సతీష్, రాంబాబు, కేవీ బ్రహ్మం, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలోని పేదలకు అండగా నిలిచి ఆర్యవైశ్య ప్రొఫెషనల్స్ అండ్ ఆఫీషియల్స్ (అవోపా) విలువైన సేవలు అందిస్తోందని బొమ్మరిల్లు గ్రూపు చైర్మన్ పరుచూరి సతీష్ పేర్కొన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో పేదలు, వృద్ధులకు నెలవారీ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సతీష్ మాట్లాడుతూ ప్రతి నెలా 108 మంది రూ.500 చొప్పున పెన్షన్లు, నిత్యావసర సరుకులు ఇవ్వడం అభినందనీయమన్నారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ అవోపా ద్వారా సివిల్ సర్వీసులకు ఉచిత శిక్షణతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా పేద విద్యార్థినికి ఫీజు నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి సుబ్బారావు, సభ్యులు జనార్దన్‌రావు, నారాయణరావు, మోహనరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమ ఎన్నికలకు నిఘా అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఖరారు చేయడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల వాతావరణం ఒక్కసారి వేడెక్కిందని, ఎన్నికలు న్యాయబద్ధంగా సక్రమంగా జరిగేందుకు ఎన్నికల సంఘం నిఘా పెట్టాలని ఎ.పి.లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మోగిన ఎన్నికల నగారా–వేడెక్కిన వాతావరణం అన్న అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించడం అనేది కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ విధి అని ఏడు దశల్లో లోక్ సభ ఎన్నికలు నిర్వహించడం వల్ల కొంత మేలు ఉన్నప్పటికీ లోపాలు కూడా లేక పోలేదన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఇంజినీర్ ఎస్.సదాశివంలు మాట్లాడారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దంత వైద్యశిబిరం

లక్ష్మీపురం: స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరంలో దంత వైద్యురాలు డాక్టర్ కొండా ప్రత్యూష వైద్య సేవలు అందించారు. సంస్థ సభ్యులు 300 మందికి ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండా ప్రత్యూషను సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సభ్యులు తదితరులు ఘనంగా సత్కరించారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పాత గుంటూరు: బృందావన్‌గార్డెన్స్ కంచికామకోటిపీఠ వేంకటేశ్వరస్వామి దేవాలయం 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 24వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు సిహెచ్ మస్తానయ్య తెలిపారు. ఆదివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి వివరాలు తెలిపారు. 19న సాయంత్రం విష్వక్సేన ఆరాధన, ధ్వజారోహణ, అంకురారోపణ, 20న శేషవాహన సేవలో స్వామివారి ఊరేగింపు, 21న హనుమత్ వాహనంపై స్వామివారి నగరోత్సవం, సాయంత్రం గరుడ వాహనంపై స్వామి ఊరేగింపు, 22న గజవాహన సేవలో స్వామి నగరోత్సవం, 23న ఉదయం సువాసిని పూజ, చండీహోమాలు, సాయంత్రం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం, 24న ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, అన్నసమారాధన, పవళింపు సేవ జరుగుతాయని వివరించారు. భారతీ ధార్మిక పరిషత్ వ్యవస్థాపకుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ ఉపాధ్యక్షులు లంకి విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఆదివారం పరీక్షల ప్యాడ్‌లను పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు ఉన్నం సంపూర్ణకుమార్, సంకా ప్రకాష్ సహకారంతో పరీక్షల ప్యాడ్‌లు, పెన్నులను 92మందికి తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎం.బాలునాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులంతా పరీక్షలను బాగా రాసి నూరు శాతం ఉత్తీర్ణత కావాలని ఆకాంక్షించారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.అన్నారావు, లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమ్‌సేన కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



కార్యాలయాన్ని ప్రారంభించి, అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

నెహ్రూనగర్: గుంటూరు నగరం లాడ్జిసెంటర్ ఏఈఎల్‌సీ కాంప్లెక్స్‌లో భీమ్ సేన, షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం కార్యాలయాలను మాజీ హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆదివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ షెడ్యూల్డ్ క్యాస్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఒక అసోసియేషన్ కిందకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నేలపాటి నాగభూషణం మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎస్సీ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి తాము పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. భవిష్యత్తులో అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు ఎస్సీ ఎంప్లాయిస్ మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు యడ్ల ప్రభాకర్, రాచకొండ రాజకుమారి, కృష్ణమూర్తి, మనోహర్, మృత్యుంజయుడు, ప్రవీణ్, తాడిగిరి రాజేష్, చిన్నం డేవిడ్ విలియమ్స్, ఈమని చంద్రశేఖర్, బత్తుల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.